batukammanews.com TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

23 ఆగస్టు 2026
ఆదివారం

## ఏసీబీకి చిక్కిన చందానగర్ ఎస్ఐ

### లంచం తీస్కుంటూ దొరికిన స్టేషన్ రైటర్ కూడా..

హైదరబాద్, బతుకమ్మ :సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ని చందానగర్ ఎస్ఐ, స్టేషన్ రైటర్ లు లంచం తీసుకుంటుండ గా ఏసీబి అధికారులకు చిక్కారు. శనివారం రంగారెడ్డి జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడి చేసి చందానగర్ ఎస్ఐ బందెల బాలరాజు, స్టేషన్ రైటర్ రాఘవేందర్ లు రూ. 70 వేలు లంచం తీసుకుశీటుండగ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు.



02



## తెలంగాణ యువతకు

# ప్రపంచస్థాయి విద్య పరిశోధన అవకాశాలు

హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మరో ముందడుగు

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రముఖ విద్యావేత్తలతో సమావేశం

02

హైదరబాద్, బతుకమ్మ:తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో ఫలప్రదమైన సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి తో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు , సీఎం సలహాదారు, ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు , ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు. తెలంగాణలో అంతర్జాతీయ విద్యా కార్యక్రమాలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించినట్లు సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ఆక్స్ ఫర్డ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్, పరిశోధన కార్యక్రమాలను హైదరాబాద్‌కు తీసుకురావాలని ఆహ్వానించాను. తెలంగాణ యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేసేందుకు ఆక్స్‌ఫర్డ్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించడం సంతోషకరం అన్నారు.డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆక్స్‌ఫర్డ్ ప్రతినిధులను ఆహ్వానించాం.ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలతో తెలంగాణను అనుసంధానిస్తూ.. మన యువతకు ప్రపంచ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం అని తెలిపారు.ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను, కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.



### కొండా సురేఖ మంత్రి పదవి నుంచి

# భర్తరఫ్?

#### సీఎం విదేశీ పర్యటన అనంతరం మంత్రికి ఉద్వాసన

కాంగ్రెస్‌లో జోరుగా చర్చలు

02



హైదరాబాద్, బతుకమ్మ :తెలంగాణ మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమెను మంత్రి వర్గం నుంచి ఉద్వాసనకే నిర్ణయం తీసుకున్నారని తెలుస్తుంది. హైదరాబాద్ రావడంతోనే పార్టీ సీనియర్ నాయకులు, క్రమశిక్షణ కమిటీ తోను మాట్లాడి ఆయన ఆమెకు ఉద్వాసనగా చెప్పాలని నిర్ణయాన్నిచెప్పబోతున్నారని తెలుస్తోంది. ఈ మేరకు ఆమె రాజీనామా చేయని పక్షంలో, బర్తరఫ్ కోసం గవర్నర్ కు సిఫార్సు చేయాలని కూడా గట్టిగా నిర్ణయించు కున్నారని చెబుతున్నారు. ఈ వివాదంలో కొండా సురేఖ కూతురు సుష్మితను అడ్డం పెట్టుకుని ముఖ్యమంత్రిని బెదిరించాలని చూసినట్టు కనిపిస్తోంది.



## బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

హైదరబాద్, బతుకమ్మ:బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 – సీజన్ 2' పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. ఈ సారి కొత్తగా జానపద పాటలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోస్, వ్యాసాలు (ఆర్టికల్స్) కు చోటు కల్పించారు. ఈ పోటీ యువ ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

02



### తహసిల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణాలకు

# మంత్రిచే శంకుస్థాపనలు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వివిధ మండలాలకు మంజూరైన నూతన తహసీల్దార్ కార్యాలయాల భవనాలతో పాటు నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాలలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు భూపతి రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రెటరి రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎం డీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



# అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మాణంలో లోపాలు లేవు

## తేల్చి చెప్పిన సీడబ్ల్యూపీఆర్ఎస్

హైదరబాద్, బతుకమ్మ:కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఎలాంటి నాణ్యతా లోపం లేదని కాంక్రీట్ క్వాలిటీ పరీక్షల అనంతరం స్పష్టం చేసిన కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్). అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు అద్భుతంగా ఉన్నాయని ఖితాబు ఇచ్చింధి. అన్నారం బ్యారేజీలోని 72 పియర్స్‌పై పరీక్షలు చేశామని, 100% ఎలాంటి సమస్యలు లేవని స్పష్టం చేసింది. సుందిళ్ల బ్యారేజీలోని ఏడు బ్లాకుల్లో ఉన్న అన్ని పియర్స్‌పై జరిగిన పరీక్షల్లో, ఆ బ్యారేజీ కాంక్రీట్ నాణ్యత చాలా బాగున్నట్టు పరీక్ష నివేదికల ద్వారా స్పష్టం అయిందని తెలిపిన సీడబ్ల్యూపీఆర్ఎస్.



# తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి విద్య పరిశోధన అవకాశాలు



కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు , అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట , 'ఫ్రూగల్ ఏఐ' కో–చైర్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న అవకాశాలపై వారు ప్రత్యేకంగా సానుకూలంగా స్పందించారు హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, సంయుక్తంగా పరిశోధనలు చేపట్టడం, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాల్లో భాగస్వామ్యానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి. ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గం చూపనున్నాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న 'తెలంగాణ రైజింగ్' లక్ష్యానికి ఈ సమావేశం మరింత బలం చేకూర్చనుంది.

# కొండా సురేఖ మంత్రి పదవి నుంచి భర్తరఫ్?

కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని తల్లి కొండా సురేఖ చెబుతున్నప్పటికీ ఆమె ప్రోద్బలంతోనే ఇదంతా జరిగిందన్నది అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యమంత్రిని వాడు వీడు అంటూ విలువలేకుండా మాట్లాడటం, పరకాల నియోజకవర్గం నుంచి తానే పోటీ చేస్తానని కూతురు చేత చెప్పించడం కూడా పార్టీ సీరియస్ గానే పరిగణించింది. ఇప్పుడు ఇలాంటివి సహిస్తే భవిష్యత్తులో మరిన్ని తలెత్తుతాయని భావించి వేటు వేయాలన్న నిర్ణయానికి వచ్చారు . తన కూతురు వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పినప్పటికీ ఆమె ఆ తర్వాత రోజే మీడియాతో తన కూతురితో కలిసే బాల్కనీ నుంచి మాట్లాడడం జరిగింది. దీంతో తన కూతురు తనకు సంబంధం లేకుండా మాట్లాడింది అన్న మాటలకు విలువ లేకుండా పోయింది. ఆమె ప్రోద్బలంతోనే పార్టీని, ముఖ్యమంత్రిని బెదిరించాలన్న ఉద్దేశంతోనే, ఆ విధంగా భర్తకు పదవి తెచ్చుకోవాలన్న ఒక ఆలోచనతో చేసిన చర్యగా భావిస్తున్నారు.

## ఆల్ప్రాజోలం అక్రమ రవాణాదారుల

# రూ.5.15 కోట్ల విలువైన ఆస్తులు జప్తు

### పోలీస్ కమీషనర్ సాయిచైతన్య

నిజామాబాద్ క్రైం , బతుకమ్మ : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల అక్రమ తయారీ, రవాణా, సరఫరా విక్రయాలకు పాల్పడుతున్న వారి ఆస్తులను పోలీసు శాఖ జప్తు చేసింది. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు?బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో బోధన్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ బాబు ఆధ్వర్యంలో గతేడాది సాలురా సరిహద్దులో అంతర్రాష్ట్ర ఆల్ప్రాజోలం తయారీ, సరఫరా నెట్‌వర్క్ ను పోలీసులు ఛేదించారు. ఆల్ప్రాజోలం తయారీ, సరఫరాకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్లపై ఎన్ డీపీఎస్?చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. వారి వద్ద నుంచి సుమారు 2.5 కిలోల ఆల్ప్రాజోలం స్వాధీనం చేసుకోగా?దాని విలువ సుమారు రూ.25 లక్షలు, స్కోడా కారు (హెచ్ డి 7889), 8 మొబైల్ ఫోన్లు, రూ.2.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.మహారాష్ట్రలోని సతారా పారిశ్రామిక ప్రాంతంలో సూర్య ప్రభ ఫార్మా కెమ్?పేరుతో ఎరువుల తయారీ కోసం అనుమతులు పొంది,అక్రమంగా ఆల్ప్రాజోలం తయారు చేస్తున్న ఫ్యాక్టరీని గుర్తించారు. అక్కడ నిర్వహించిన సోదాల్లో సుమారు 30 కిలోల ఆల్ప్రాజోలం లభించగా?దాని విలువ సుమారు రూ.3 కోట్లు, అక్రమంగా సంపాదించిన రూ.12 లక్షల నగదు,?ఒక ఫోర్డ్ కారును స్వాధీనం చేసుకునిఅక్రమంగా నిర్వహిస్తున్న ఫ్యాక్టరీని సీజ్ చేశారు.డ్రగ్ డబ్బుతో కూడబెట్టిన రూ.5.15 కోట్ల ఆస్తులపై జప్తు చర్యలు డ్రగ్ అక్రమ రవాణాలో నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు??వారు మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తు చేయడంపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని పూణే. సతారా, అహ్మద్‌నగర్ జిల్లాల్లో సంబంధిత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాలను సంప్రదించి నిందితులు,వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన స్థిర, చర ఆస్తుల వివరాలను సేకరించారు. నిందితులు ఆమర్‌సింగ్, బసవరాజ్, లక్ష్మణ్ గౌడ్, వారి కుటుంబ సభ్యులు ఆల్ప్రాజోలం



అక్రమ విక్రయాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించారు. ప్రభుత్వ విలువల ప్రకారం సుమారు రూ.5.15 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించగా?బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ మరింత ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి:**

**సీపీ సాయిచైతన్య**

ప్రజలకు ముఖ్యంగా యువత, విద్యార్థులకు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలనీ పోలీసు కమిషనర్ సాయిచైతన్య విజ్ఞప్తి చేశారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, అక్రమ నిల్వ, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్ నెట్‌వర్క్‌లను పూర్తిగా నిర్మూలించడంలో, ఆల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో, ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ఏసీబీకి చిక్కిన చందానగర్ ఎస్ఐ

చందానగర్ పిఎస్ లో నమోదయినా ఒక కేసు లో చార్జెషీట్ లో అనుకూలంగా రాసేందుకు ఇదివరకు ఎస్ఐ బాలరాజు రూ. 20 వేలు, స్టేషన్ రైటర్ రాఘవేందర్ రూ. 10 వేలు స్వీకరించారు. 70 వేలు ఇస్తేనే ఛార్జ్ షీట్ లో అనుకూలంగా రాస్తామని బెదిరించడం తో బాధితుడు ఏసీబీ ని అశ్రయించాడు. బాధితుడి నుంచి లంచం తీస్కుంటుండగా ఇద్దరిని పట్టుకొని నాంపల్లి లోని ఏసీబీ కోర్ట్ లో హాజరు పరుచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.

# బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు.

# డీఎన్ఏ మడతల్లోనూ గుండె జబ్బుల రహస్యం

మన శరీరంలోని ప్రతి కణానికి అవసరమైన జన్యు సూచనలను డీఎన్ఏ అందిస్తుంది. జన్యువుల్లో మార్పులే వ్యాధులకు ప్రధాన కారణమని ఇప్పటివరకు భావించినప్పటికీ, డీఎన్ఏ కణంలో ఎలా మడతపడి, త్రీడీ ఆకృతిలో ఎలా అమరిక అయి ఉంటుందన్న అంశం కూడా కీలకమని తాజా పరిశోధన వెల్లడించింది. ముఖ్యంగా పుట్టుకతో వచ్చే గుండె లోపాలపై ఇది కొత్త అవగాహనను అందిస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి 100 మంది శిశువుల్లో సుమారు ఒకరికి పుట్టుకతో వచ్చే గుండె లోపం కనిపిస్తోంది. గుండె అభివృద్ధిలో కీలకమైన టీబీఎక్స్5 జన్యువులో మార్పులు కూడా ఇందుకు కారణమవుతాయి.

ఈ జన్యువు రెండు ప్రతుల్లో ఒకటి మాత్రమే పనిచేసినప్పుడు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎందుకు వస్తాయన్న ప్రశ్నకు తాజా అధ్యయనం సమాధానం సూచిస్తోంది.

**స్టెమ్ కణాలను గుండె కండర**

**కణాలుగా మార్చి..**

పరిశోధకులు మానవ స్టెమ్ కణాలను గుండె కండర కణాలుగా మార్చి, టీబీఎక్స్5 రెండు ప్రతులు ఉన్న కణాలతోపాటు ఒకటి లేదా రెండూ లేని కణాలను పరిశీలించారు. అత్యాధునిక త్రీడీ మ్యాపింగ్, కంప్యూటర్ నమూనాల ద్వారా డీఎన్ఏ నిర్మాణాన్ని విశ్లేషించారు. టీబీఎక్స్5 లోపంతో డీఎన్ఏలోని పెద్ద విభాగాలు, ప్రత్యేక ప్రాంతాలు, క్రోమాటిన్ లూప్‌లు సహా మొత్తం నిర్మాణం గణనీయంగా మారినట్లు గుర్తించారు. టీబీఎక్స్5, కోహెసిన్ మాలిక్యులర్ మోటార్‌ను డీఎన్ఏలోని సరైన ప్రాంతాలకు చేర్చడంలో సహాయపడుతుంది. దీంతో జన్యువులు, వాటిని నియంత్రించే ప్రాంతాలు దగ్గరై అవసరమైన జన్యు సూచనలు సరైన సమయంలో పనిచేస్తాయి. టీబీఎక్స్5 స్థాయి సగానికి తగ్గినా ఈ లూప్‌ల నిర్మాణం దెబ్బతినీ గుండె అభివృద్ధికి అవసరమైన



జన్యువుల పనితీరుపై ప్రభావం పడుతున్నట్లు అధ్యయనం సూచించింది.

**డీఎన్ఏ మడతలను సరిచేస్తే..**

అదే జన్యు లోపానికి గుండెలోని వివిధ కణాలు భిన్నంగా స్పందించడం, వ్యక్తుల మధ్య గుండె లోపాల తీవ్రత ఎందుకు మారుతుందో వివరించడంలోనూ ఈ పరిశోధన ఉపయోగపడనుంది. భవిష్యత్తులో ఇతర పుట్టుకతో వచ్చే వ్యాధుల్లోనూ డీఎన్ఏ త్రీడీ నిర్మాణం పాత్రను పరిశీలించనున్నారు. డీఎన్ఏ మడతలను సరిచేయడం ద్వారా కొన్ని జన్యుపరమైన లోపాలను నివారించగలమా అన్నది తదుపరి పరిశోధనల్లో కీలక ప్రశ్నగా మారనుంది.

# మంత్రితో కలిసి ప్రభుత్వ స్థలం పరిశీలన



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నగరంలో స్థలం లేని వారికోసం డబుల్ బెడ్ రూమ్ టవర్ల నిర్మాణం కొరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ శనివారం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. నగరంలోని నాగారం స్టేడియం వద్ద గల రెండెకరాల స్థలాన్ని పరిశీలించారు. అలాగే కలెక్టరేట్ వద్ద గల డబుల్ బెడ్ రూమ్ లను కూడా పరిశీలించి వివరాలను ఆరా తీశారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని, మరమ్మతులు చేయాలన్నారు. వీలైనంత తొందరగా అర్హులైన పేదలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

# లా.. తెలుసుకుంటేనే.. జీవితంలో ఆటంకాలను అధిగమించవచ్చు






### తల్లితండ్రుల తరువాత గురువులే ప్రధాన్యం
### విద్యతో పాటు చట్టాలను తెలుసుకోవాలి
### నిజామాబాద్ అదనపు జిల్లాజడ్జి దారావత్ దుర్గా ప్రసాద్

నిజామాబాద్ లీగల్, బతుకమ్మ ప్రతి పౌరుడు మరి ముఖ్యంగా విద్యార్థినిలు లా..గురించి తెలుసుకుంటే జీవిత ప్రయాణంలో ఆటంకాలను అదిగమించగలరని నిజామాబాద్ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి దారావత్ దుర్గా ప్రసాద్ తెలిపారు. విద్యతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన విద్యార్థినిలకు ఉద్బోదించారు.నిజామాబాద్ నగరంలోని కాకతీయ మహిళ జూనియర్ కాలేజీలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినిలనుద్దేశించి ప్రసంగించారు.ఒక నేరఘటన జరిగిన పిదప సంబంధిత పోలీస్ స్టేషన్ లో పిర్యాదు దాఖలు చేసే విధానం, బాధితుల సాక్ష్యాలను, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను పోలీసు విచారణ అధికారులు నమోదు ప్రక్రియలో ఉన్న విదివిధానాలను ఆయన తెలిపారు. నేర విచారణ పూర్తి అయిన తరువాత పోలీసులు ఛార్జ్ షీట్ ను కోర్టులో దాఖలు చేసే తీరుతెన్నులను తెలియజేశారు. కొందరు విద్యార్థినిలను వేదిక దగరకు పిలిపించి చట్టంలోని సెక్షన్ ఏమీ చెబుతున్నదో వివరిస్తూ.. మైనర్ బాలలు మోటారు బైక్ డ్రైవ్ చేయడం చట్ట ప్రకారం చెల్లనేరదని... దాని మూలంగా ఎదురయ్యే ప్రమాదాలు గాయాలు కావచ్చు లేదా ప్రణాంతకం కావచ్చని అన్నారు.మైనర్ బాలబాలికలకు బైక్ లు డ్రైవింగ్ కు ఇచ్చిన తల్లితండ్రులు, బైక్ యజమానులు చట్టం విధించే శిక్షలకు బాద్యులు కాగలరని జడ్జి దుర్గా ప్రసాద్ తెలిపారు.విద్యార్థినిలకు చట్టంలో ఉన్న విషయ పరిజ్ఞానాన్ని ఎరుకజేస్తూ తెలియక చేసిన తెలిసి చేసిన నేరం నుండి ఎవరికి రక్షణ లేదనని సందర్భోచితంగా వివరించారు.విద్యార్థినిలకు చట్టరూప ప్రశ్నలను సందిస్తూ వారి నుంచే సమాధానాలు రాబట్టి చట్టం ఎంత ప్రయోజనకరమో అంతే చట్ట ప్రకారం రుజువైన నేరాలలో వ్యక్తులను శిక్షించడంలో వెనుకడుగు వేయదని ఆయన పేర్కొన్నారు.నిజామాబాద్ ఫ్యామిలి కోర్టు (మూడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ) క్షత్రి ఉషా కిరణ్ మాట్లాడుతూ మనకోసం మనం శాసన వ్యవస్థలైన పార్లమెంట్, రాష్ట్రాల శాసన సభల ద్వారా రూపొందించుకున్న చట్టాలను గౌరవిస్తూ చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలనీ అన్నారు.కాకతీయ మహిళ జూనియర్ కాలేజీ ప్రిన్స్ పాల్ సందీప్ కులకర్ణి మాట్లాడుతూ న్యాయవిజ్ఞాన సదస్సుతో చట్టపరమైన విషయాలు విద్యార్థినిలకు అందజేసిన న్యాయసేవ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి వ్యఖ్యాతగా న్యాయవాది వొజ్జల రణధీష్ వ్యవహారించారు.కార్యక్రమంలో న్యాయసేవ సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేధార్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఉదయ కృష్ణ, మహమ్మద్, షాదుల్లా, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ శుభం, ప్రమోద్,న్యాయసేవ సంస్థ ప్యానల్ న్యాయవాదులు మాణిక్ రాజు,ప్రతిభ, సాయితేజ రాజు,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలి

### తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి డిమాండ్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ: రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా బుకింగ్ యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, రైతులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా యూరియా అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. యూరియా పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ విధానం రైతులకు తీవ్ర ఇబ్బందులను తెచ్చిపెడుతోందని పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్లు వాడకంలో లేని రైతులు, పట్టాదారు పాస్ పుస్తకాలు లేని రైతులు,డిజిటల్ పరిజ్ఞానం కాని రైతులు ఈ యాప్ ద్వారా ఎరువులు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యలు, సర్వర్ డౌన్ సమస్యల వల్ల ఎరువులు సకాలంలో అందడం లేదని, వెంటనే యాప్ విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. పాత మాన్యువల్ విధానం ద్వారా ఎరువుల దుకాణాల వద్దే నేరుగా పాత పద్ధతిలో యూరియా కాంప్లెక్స్ ఎరువులు అందజేయాలని, పట్టాదారు పాస్ బుక్ నిబంధనలను సడలింపు చేసి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులందరికీ యూరియా, కాంప్లెక్స్ ఎరువులను అందజేయాలని తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి కోరారు.

# పేద విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పిస్తాం
### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ఉట్నూర్, బతుకమ్మ:పేద, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. శనివారం మంత్రి ఉట్నూరు బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్ను మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్యానెల్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద, గిరిజన విద్యార్థులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా విద్యను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు, షూస్, పుస్తకాలు, ఇతర అవసరమైన సౌకర్యాలు అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు.ఆశ్రమ, గురుకుల పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**ఉన్నత స్థానాలకు ఎదగాలి: ఎమ్మెల్సీ దండే విఠల్**

పేద, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి కలెక్టర్లు, ఇంజనీర్లు, వైద్యులు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు.విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్, గిరిజన స్టడీ సర్కిల్ ద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందిస్తూ అనేక మంది ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని చెప్పారు. విద్యార్థులకు ఉన్నత చదువులు, పోటీ పరీక్షల కోసం ప్రత్యేక కోచింగ్ సదుపాయాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**పాఠశాలల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రభుత్వం కల్పిస్తున్న డిజిటల్ బోర్డులు, సైన్స్ ల్యాబ్లు, ఇతర ఆధునిక సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని



తెలిపారు.ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులు ఇటీవలి కాలంలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆశ్రమ పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఫ్లోచీ) కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులకు క్రమం తప్పకుండా శిక్షణ, నెలవారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ సంతోష్, ఎస్ఈటిడబ్ల్యూ ఫణికుమారి, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏఎస్పీ రుత్విక్ సాయి కోటే, ఆర్డీఓ మోహన్ సింగ్, డి. ప్రేమకళ, డీటీడీఓలు అంబాజీ, నిహారిక, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ అనిత జాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# శక్తి స్కీమ్ జీవో 97 ను వెంటనే రద్దు చేయాలి

### పాలిటెక్నిక్ కళాశాలలో పీడీఎస్ యు నిరసన




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : తెలంగాణ ప్రభుత్వం పాలిటెక్నిక్ డిప్లమా కాలేజీలను, ఐటిఐ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ లేదా శక్తి ప్రేమ్ వర్క్ కింద విలీనం చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని పి డి ఎస్ యూ జిల్లా అధ్యక్షులు ఆర్.గౌతం కుమార్, నిజామాబాద్ నగర అధ్యక్షులు సిర్రం పవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో కలిసి పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 97 ను తీసుకువచ్చి ప్రభుత్వ సాంకేతిక విద్యను ప్రైవేట్ పరం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని, పేద మధ్యతరగతి విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకోవాలని, పాలిటెక్నిక్ డిప్లమా ద్వారా ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరం లో ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ నగర నాయకులు మహేష్, హరికృష్ణ, ప్రమోద్, వంశి, శ్రావణ్, బీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు విద్యార్థుల నిరసన...

జువాలజీ, సివిక్స్ పాఠ్యాంశాలు

అర్థం కావడం లేదంటూ ఆవేదన....

సంవత్సరం గడుస్తున్న లెక్చరర్లను కేటాయించడం

లేదంటూ ఆగ్రహం...




బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు తమ విద్యా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం నిరసనకు దిగారు. ముఖ్యంగా జువాలజీ, సివిక్స్ తదితర సబ్జెక్టుల బోధన సరిగా అర్థం కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.తరగతుల్లో పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని, విద్యార్థులకు సందేహ నివృత్తి చేసేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కోరారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో సబ్జెక్టులపై స్పష్టత లేకపోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిశీలించి, అవసరమైన బోధనా చర్యలు చేపట్టాలని వారు కోరారు. సంవత్సరం గడుస్తున్న విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడంలేదని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. తక్షణమే నూతన లెక్చర్లను ఏర్పాటు చేయాలని లేనియెడల ఆందోళనలో ఉధృతం చేస్తామని బీస్మించి కూర్చున్నారు. రెండు గంటలు కొనసాగుతున్న ఆందోళన విరమించకుండానే ఎండలోనే కళాశాల ముందు బైఠాయించారు. ప్రతిరోజు ప్రైవేట్ క్లాసులకు బయట వెళ్తున్నామని మా బాధ ఎవరు పట్టించుకుంటారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజుల్లో గా లెక్చర్ల లను నియమిస్తామని కళాశాల ప్రిన్సిపల్ జిల్లా నోడల్ అధికారి సలాం విద్యార్థులకు హామీ ఇచ్చారు. సంవత్సరంగా ఫిర్యాదులు ఇచ్చిన పట్టించుకోలేని ప్రిన్సిపాల్ ఐదు రోజుల్లో ఎలా నియమిస్తారంటూ విద్యార్థులు నిలదీశారు. తక్షణమే లెక్చర్లను నియమించేంతవరకు నిరసన విరమించేది లేదంటూ విద్యార్థులు బైఠాయించారు. శాశ్వత పరిష్కారం అయ్యేంతవరకు నిరసన విరమించేది లేదంటూ విద్యార్థులు డిమాండ్ చేశారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

## చెట్టు కిందే తరగతులు...

కళాశాలలో వసతిగృహం ఏర్పాటు చేయడంతో

విద్యార్థులకు ఇబ్బందులు.





బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీసీ సంక్షేమ కళాశాల బాలికల వసతిగృహం ఏర్పాటు చేయడంతో కళాశాల విద్యార్థులకు తరగతి గదుల కొరత ఏర్పడింది. దీంతో విద్యార్థులు కళాశాల ఆవరణలో చెట్ల కింద కూర్చొని తరగతులు వినాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండ, వర్షాల సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే చాలు కళాశాలకు డుమ్మా కొట్టాల్సిందేనని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాల విద్యార్థులకు సరిపడా తరగతి గదులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. వసతి గృహాన్ని మరో భవనంలోకి మార్చాలని విద్యార్థులకు డిమాండ్ చేస్తున్నారు.



# సామాజిక సేవా రంగాల్లో కొత్వాల్ రాజా బహదూర్ వెంకట రామారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

### గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ కవిత రెడ్డి





నిజామాబాద్ సిటీ, బతుకమ్మ:విద్యా వ్యాప్తి, మహిళా అభ్యున్నతి, సామాజిక సేవా రంగాల్లో కొత్వాల్ రాజా బహదూర్ వెంకట రామారెడ్డి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ కవిత రెడ్డి పేర్కొన్నారు. 157వ జయంతి సందర్భంగా శనివారం నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్ మహనీయుల పార్కులో రాజా బహుదూర్ వెంకట రామిరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ××సఖీఔ గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ కవిత రెడ్డి రాజా బహదూర్ వెంకట రామారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ నిజాం కాలంలోనే విద్యా వ్యాప్తికి, ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధికి వెంకట రామారెడ్డి విశేషంగా కృషి చేశారని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్వాల్‌గా బాధ్యతలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. హైదరాబాద్‌లో ఆయన కృషితో ఏర్పాటైన రెడ్డి హాస్టల్, మహిళా విద్యాసంస్థలు నేటికీ ఎంతోమందికి విద్యావకాశాలు కల్పిస్తూ ఆయన సేవలకు నిదర్శనంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధిని ఆకాంక్షించిన కారణజన్ముడు రాజా బహదూర్ వెంకట రామారెడ్డి అని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన పట్టోళ్ల శంకర్ రెడ్డి మాట్లాడుతూ వెంకట రామారెడ్డి విద్యారంగంతో పాటు సేవా రంగంలోనూ తనదైన ముద్ర వేశారని తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరికీ సేవ చేయాలనే లక్ష్యంతో పనిచేసిన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాయిరెడ్డి మాట్లాడుతూ నిజాం కాలంలోనే మహిళలు చదువుకోవాలనే సంకల్పంతో మహిళా పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ల ఏర్పాటుకు కృషి చేసిన ఘనత రాజా బహదూర్ వెంకట రామారెడ్డికి దక్కుతుందని అన్నారు. ఆయన స్ఫూర్తితో నిజామాబాద్‌లోనూ మహిళా విద్యాభివృద్ధికి పలువురు ప్రముఖులు విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వేలాది మంది మహిళలు ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేశారని తెలిపారు. వెంకట రామారెడ్డి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీపీఎస్ ప్రభాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంత రెడ్డి దేవేందర్ రెడ్డి, మల్లేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, బి.వి. గోపీనాథ్ రెడ్డి తదితరులతో పాటు జిల్లాలోని వివిధ రెడ్డి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రి పర్యటన పేరుతో పీడీఎస్ యు నాయకుల ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

### విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా అరెస్టులతో ఉద్యమాలను అణచలేరు



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన సందర్భంగా విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే అవకాశం ఉందనే భయంతో పీడీఎస్ యు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కర్క గణేష్‌ను ముందస్తుగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అషూర్ తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, సమస్యలను పరిష్కరించకుండా విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. మంత్రి పర్యటనకు విద్యార్థి సంఘాలు అడ్డంకిగా మారతాయనే భయంతో ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు.అదేవిధంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, విద్యార్థుల విద్యకు నష్టం కలిగించే విధానాలను పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. జీవో 97 ద్వారా ఏర్పడుతున్న విద్యారంగ సమస్యలను పరిష్కరించి, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడం, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడం వంటి అసలు సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తున్న పీడీఎస్ యు నాయకులను అరెస్టు చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ముందస్తు అరెస్టులను నిలిపివేసి, విద్యార్థి సంఘాల నాయకులతో చర్చించి విద్యారంగ సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్ యు ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకంలో బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి

### తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన చేయూత పెన్షన్ పథకంలో బీడీ కార్మికులందరికీ జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సభకు యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల చివరి నాటికి చేయూత పెన్షన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని అప్లికేషన్ మోడల్ ను విడుదల చేసిందన్నారు. ఇందులో చేనేత కార్మికులు, గీతా కార్మికులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారనీ,కానీ బీడీ కార్మికులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించలేదన్నారు. ఇది బీడీ కార్మికుల పట్ల కక్షపూరిత వైఖరిని తెలియజేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు చేయూత పెన్షన్లలో జీవనభృతి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా బీడీ కార్మికులతో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్ మాట్లాడుతూ బీడీ కార్మికులకు పని దినాలు తక్కువై పూటగడవడం కష్టమైందన్నారు. యూనియన్ నాయకత్వంలో బీడీ కార్మికులు పోరాడి జీవన భృతిని సాధించుకున్నారు.జీవన భృతి వీరి జీవితాలకు కొంత ఊరటనిచ్చిందన్నారు. కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు మొండిచేయి చూపించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. బీడీలు చుట్టే కార్మికులకు,బీడీ ప్యాకర్లకు, నెలసరి జీతాల ఉద్యోగులకు,బీడీ కమిషన్ ఏజెంట్లకు చేయూత పెన్షన్లలో జీవనభృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శులు బి. మల్లేష్, డి.కిషన్ లు మాట్లాడారు. యూనియన్ జిల్లా నాయకులు సాయరెడ్డి, లింగం, లక్ష్మి,వసంత, అంజమ్మ, ప్రజాసంఘాల నాయకులు గణేష్, సాయిబాబా, నాగమణి, సృజన్, శ్రీశాంత్, అరుణోదయ కళాకారులు గంగాధర్, రమేష్, చరణ్ లు తమ పాటలతో బీడీ కార్మికులను చైతన్యపరిచారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

# బాన్సువాడలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం.



బాన్సువాడ, బతుకమ్మ : విద్యుత్ లైన్‌లో మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ఏఈ సంతోష్ కుమార్ తెలిపారు. తాడుకోల్ రోడ్డు, వాసవి కాలనీ, కోటగల్లి, బీడీ కాలనీ, ఆర్ఫత్ కాలనీ, ఫిర్దోస్ కాలనీ, కొయ్యగుట్ట రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ లైన్ మరమ్మతు పనులకు ప్రజలు సహకరించాలని ఏఈ సంతోష్ కుమార్ కోరారు.

# జిల్లా అభివృద్ధి పట్ల బిజెపి నాయకుల ద్వంద వైఖరి విడనాడాలి

### మల్యాల గోవర్ధన్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడంలో భాగంగా పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు జిల్లాకు విచ్చేసిన రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి సమావేశ హాల్ లోకి బిజెపి కార్యకర్తలు అక్రమంగా దూసుకువచ్చి ఆందోళన నిర్వహించడాన్ని డిసిసి కార్పొరేషన్ అధికార ప్రతినిధి మల్యాల గోవర్ధన్, 9వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అమర్ సింగ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుప్పాల దేవేందర్ లతో కలిసి నిర్వహించిన సమావేశం లో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా డిసిసి కార్పొరేషన్ అధికార ప్రతినిధి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పదేళ్లుగా నిరుపేదలకు అందించడంలో విఫలం అయ్యారని, వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయడం కోసం అదనంగా హైదరాబాద్ తరహాలో క్యూర్ పద్ధతుల్లో బహుళ అంతస్తుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి నిజామాబాద్ నగర ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు?నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో బిజెపి ఎమ్మెల్యే కూడా పాల్గొన్నార న్నారు. అంతేకాకుండా ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి నిర్వహిస్తున్న సమీక్షా సమావేశంలో వేదికపై బిజెపి ఎమ్మెల్యేలు ఉండగానే మరోవైపు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై బిజెపి నాయకులు బయట నుండి ఆందోళన చేయడం వారి రాజకీయ ద్వంద వైఖరికి అద్దం పడుతుందని అన్నారు. బిజెపి నాయకులు తమ రాజకీయ పబ్బం గడుపుకునే అంశంపై ఉన్న శ్రద్ధ నిరుపేదల సొంతింటి కలలు నెరవేర్చే విధంగా లేకపోవడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన ఇండ్ల నిర్మాణపు బిల్లులు రాకపోవడంతో చివరి దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించి వారి సొంత ఇంటి కలను నెరవేరుస్తుందన్నారు. కళ్ళుండి చూడలేని బిజెపి నాయకులు నిరుపేదలపై ప్రేమ ఉంటే కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను వెంటనే రప్పించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధికి ఆటంకం కలిగించే చర్యలకు బిజెపి నాయకులు పాల్పడితే భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

# రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం




నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రిమాండ్ ఖైదీ ఒకరు ఆత్మహత్యాయత్నం చేశారు. వైద్యం కోసం నిజామాబాద్ సెంట్రల్ జైలు నుంచి జీజీహెచ్ కు వచ్చిన ఖైదీ ఆసుపత్రిలో మూడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికుల 1వ టౌన్ పోలీసుల కథనం ప్రకారం కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలంకు చెందిన లకావత్ రాజు పై ఇటీవల స్థానిక పీఎస్ లో కేసు నమోదైంది. పోలీసులు అతడిని అరెస్టు చేసి నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించారు. శనివారం సెంట్రల్ జైలులో సాధారణ వైద్య పరీక్షల్లో భాగంగా ఎస్కార్ట్ మధ్య నిజామాబాద్ జీజీహెచ్ కు తరలించారు. అక్కడ ఎస్కార్ట్ సిబ్బంది ఏమరుపాటుగా ఉండడాన్ని గమనించిన లకావత్ రాజు మూడవ అంతస్తు నుంచి కిందికి దూకాడు. ఈ ఘటనలో రాజుకు తీవ్ర గాయాలు కాగా జీజీహెచ్ లోనే వైద్యం అందిస్తున్నారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

# ఆటో డ్రైవర్ల సమ్మె పోస్టర్ ఆవిష్కరణ




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ: ఈ నెల 24న జరిగే ఆటో రాష్ట్ర వ్యాప్త సమ్మెకు సంబంధించి సిఐటియు కార్యాలయంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 24న ఆటో క్యాబ్ స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక బంధు ప్రకటించటం జరిగిందని అనేకమంది నిరుద్యోగులు ఉపాధి కోసం ప్రభుత్వాలపై ఆధారపడకుండా అప్పులు చేసి ఆటోలు కొనుక్కొని ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తూ జీవనోపాధిని పొందుతున్నారని అటువంటి ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12,000 రూపాయలు ఇవ్వటం జరుగుతుందని ప్రాక్టించారని కానీ నేటికీ దాన్ని అమలు జరపటం లేదని పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్లో 15 వేల రూపాయలు ఆటో డ్రైవర్లకు ఇస్తున్నారని ఆయన అన్నారు. గత 30 సంవత్సరాలుగా ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం అనేక పోరాటా లు,ఉద్యమాలు చేసినప్పటికీ ప్రభు త్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని సంక్షేమ బోర్డు ఏర్పాటయితే యాక్సిడెంట్ లో ఆటో డ్రైవర్ చనిపోయిన వారి కుటుంబానికి ఉపయోగపడ తారని,?ఇప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ రకంగా వారిని ఆదుకోవడం లేదని ఆయన అన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు వలన రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థికపరమైన ఇబ్బందులు లేవని, సంక్షేమ బోర్డుకు ఆటోలు, క్యాబులు కొన్న ఇతర వాహనాలు కొన్న సందర్భంలో రెండు శాతం సెస్సులు కనుక వసూలు చేసినట్లయితే కోట్లాది రూపాయల సంక్షేమ బోర్డుకు నిధులు వస్తాయని ఆ విధంగా కార్మికుల సంక్షేమానికి వాటిని వాడవచ్చని ఆయన అన్నారు. అదేవిధంగా ఆర్టీసీ కార్మికులపై పోలీసుల చేత విపరీతంగా చలాన్లను వేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. కావున ఈ పై సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న జరిగే బందును విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఉద్ధవ్, అబ్దుల్, వసీం,సాహెబ్,తదితరులు పాల్గొన్నారు.

### వనమహోత్సవంలో భాగంగా

# మొక్కలు నాటిన ఎస్ఐ వినయ్



నందిపేట్ బతుకమ్మ.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా నందిపేట్ మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంనందిపేట్ మండల ఎస్ఐ వినయ్ కుమార్ చేతుల మీదుగా ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగిందిఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు అక్బర్, లక్కంపల్లి శేఖర్,పవన్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

# బిచ్కుంద జూనియర్ కళాశాలలో డ్రగ్స్ అవగాహన సదస్సు







బతుకమ్మ ,బిచ్కుంద :ప్రభుత్వ జూనియర్ కళాశాల బిచ్కుందలో శనివారం విద్యార్థులకు డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిచ్కుంద ఎస్ఐ గుండెల రాజు మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వల్ల జీవితాలు నాశనమవుతాయని, చదువుపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. అలాగే ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని హెచ్చరించారు. తల్లిదండ్రులకు హెల్త్ ఇన్సూరెన్స్ చేయించేలా విద్యార్థులు చొరవ తీసుకోవాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ సేవిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ బి. శివకుమార్ మాట్లాడుతూ ఇకపై ప్రతి శనివారం కళాశాలలో డ్రగ్స్ అవేర్నెస్, టెలి మానస్, మెడిటేషన్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ అధ్యాపకులు శంకర్ అధ్యక్షత వహించారు. ఇందులో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్బన్‌లో డబుల్ బెడ్ రూమ్ టవర్లు నిర్మించాలి

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



నిజామాబ్బద్ అర్బన్, బతుకమ్మ : నియోజకవర్గంలో స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల టవర్లను నిర్మించి ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నగరంలో పేదలకు స్థలం ఉండే అవకాశం లేదని, కావున ప్రభుత్వ స్థలంలోనే హైదరాబాద్ తరహాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల టవర్లను నిర్మించాలని కోరారు. ప్రధానంగా రెండు దశల్లో గత 12 సంవత్సరాలుగా తెలంగాణలో డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వని నియోజక వర్గం కేవలం నిజామాబాద్ అర్బన్ మాత్రమే అన్నారు. ఇప్పటికైనా ఇవ్వడం సంతోషకరమన్నారు. ఇటీవల మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకి సంబంధించి పలు అంశాలను తీసుకెళ్లానని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# స్వయంభూ శ్రీ ఆదిబసవేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు.



బాన్సువాడ బతుకమ్మ : శ్రావణ మాస శనివారం సందర్భంగా స్వయంభూ శ్రీ ఆదిబసవేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని యజ్ఞ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ బోర్లం మఠాధిపతి సద్గురు సోమలింగ శివాచార్య మహారాజ్ స్వామీజీని ఘనంగా శాలువాతో సన్మానించి ఆశీర్వాదాలు పొందారు. వేద పండితుల ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సద్గురు సోమలింగ శివాచార్య మహారాజ్ స్వామీజీ, సంఘం సాయిరెడ్డి, బాలయ్య, ఆలయ వేద పండితులు శ్రీధర్ స్వామి, గుర్లింగ్ స్వామి, మంజునాథ్‌తో పాటు గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై అధికారులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం

**భూభారతి సదస్సులు, సాదాబైనామా అర్జీలను వెంటనే పరిష్కరించాలి**

**ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు**

**నిజామాబాద్ లో రెవిన్యూ మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన**







నిజామాబాద్, బతుకమ్మ:భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చారించారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం నాడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఆ తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందని తెలిపారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు.రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.పట్టణాలు, నగరాల్లో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌లో ప్రయోగాత్మకంగా టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద కుటుంబాలపై నిర్మాణ భారం తగ్గించడంతో పాటు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. 43వ డివిజన్‌లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా, నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారుల సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొంటూ, నూతన గృహ ప్రవేశం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్లను కూడా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐడీఓసీని ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత లేదని, పనులు పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హౌసింగ్ శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్య పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. మరో వారం, పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని మంత్రి వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అయ్యే వరకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.






## ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసిన డీఎంహెచ్ వో

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోనీ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులను డి ఎం హెచ్ ఓ డాక్టర్ బి రాజశ్రీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ వో మాట్లాడుతూ ఎస్ఎస్ బాలాజీ ఆసుపత్రి నందు పేషెంట్ వాహనాలకు పార్కింగ్ స్థలం, పేషంట్ల కోసం ర్యాంపు లేకపోవడంతో పాటు బయో మెడికల్ వ్యర్థాలను తొలగించడంకు సంబంధించిన ధ్రువపత్రం లేకపోవడం, రోగులకు అనువుగా సీటింగ్ అరేంజ్మెంట్, ఎమర్జెన్సీ వార్డ్ లేకపోవడం,రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లు, రోగులు కూర్చుండే హాలు నందు ప్రదర్శించకపోవడం లాంటి వాటిని గుర్తించి వెంటనే వీటన్నింటినీ సరి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా శనివారం అయ్యప్ప ఆసుపత్రి ని తనిఖీ చేయగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఉన్నట్లుగా ఆసుపత్రి బోర్డుపై లేదని, వాహనాల పార్కింగ్ స్థలం లేదని, ఫారం ఎఫ్ లో ఉన్న సమాచారం అసంపూర్తిగా ఉన్నదని, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ సర్టిఫికెట్ లేదని అన్నారు. అదేవిధంగా బాంబే నర్సింగ్ హోమ్ లో ఆరోగ్య సేవలధరల పట్టిక, ఎన్ని రకాల ఆరోగ్య సేవలు అందిస్తారనేది ప్రదర్శించలేదని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కూడా ప్రదర్శించ లేదని, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ సర్టిఫికెట్ తీసుకోలేదని ఇవన్నీ కూడా త్వరలోనే సరి చేసి రూల్స్ కు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కు అనుగుణంగా ఆరోగ్య సేవలు అందించాలన్నారు. ఈ తనిఖీలలో సి ఈ ఏ విభాగం నుండి డాక్టర్ సుప్రియ, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ కీర్తన, డిహెచ్ఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.







## కలెక్టరేట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

**మంత్రి రివ్యూ జరుగుతుండగానే దూసుకెళ్లిన బిజెపి నాయకులు**

**పోటా పోటిగా బిజెపి-కాంగ్రెస్ నాయకుల నినాధాలు**

**అడ్డుకుని బిజెపి నాయకులను అరెస్టు చేసిన పోలిసులు**

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ:రాష్ట్ర రెవిన్యూ , హౌజింగ్ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి నిజామాబాద్ లో నిరసన సెగ తగిలింది. ప్రభుత్వం తెచ్చిన భూభారతీ పోర్టల్ లో ప్రైవేట్ పట్టా భూములను నిషేదిత భూముల (22 ఏ) జాబితాలో చెర్చాడాన్ని నిరశిస్తు బిజెపి నాయకు లు కొత్త కలెక్టరేట్ లోకి దూసుకేళ్లారు. శనివారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. బిజేపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి అధ్వర్యంలో కలెక్టరేట్ లోకి దూసుకువచ్చారు. రెవిన్యూ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలిసుల బందోబస్తును దాటి కలెక్టరేట్ లోకి బిజేపి నాయకులు కార్యకర్తలు రావాడాన్ని కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఈ సంధర్భంగా బిజేపి- కాంగ్రెస్ నాయకులు పోటా పోటి నినాధాలు చేశారు. పోలిసులు అక్కడ బిజేపి నాయకులను అడ్డుకుని పోలిస్ స్టేషన్ కు తరలించారు. రాష్ట్రమంత్రి పర్యటనలో భధ్రత వైఫల్యం చోటు చేసుకోవడం పోలిస్ లకు షాక్ ఇచ్చింది.

## మల్కాపూర్‌లో ఎమ్మెల్యే మధన్ మోహన్‌కు నిరసన సెగ

ఎల్లారెడ్డి, బతుకమ్మ: అదాకార కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు నిరసన సెగ తగిలింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను నిలదీయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ సర్పంచ్ కొండ యోగితా మధు ,గ్రామస్తుల ను అడ్డుకుని నిరసన విరమింప చేశారు.





# బోర్లం మైనారిటీ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన మున్సిపల్ కమీషనర్

- డ్రాప్‌బాక్స్ ఫిర్యాదులపై ఆరా.
- విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కమిషనర్.
- విద్యా ప్రమాణాలు, బోధనా విధానంపై పరిశీలన.
- వంట సరుకుల స్టాక్ తనిఖీ.
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కమిషనర్.







బాన్సువాడ బతుకమ్మ : జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ బోర్లం మైనారిటీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని డ్రాప్‌బాక్స్‌లో అందిన ఫిర్యాదులను పరిశీలించి, వాటి వివరాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కమిషనర్ నేరుగా మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనా విధానం, విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న విద్యా నాణ్యతపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో వంటకు సంబంధించిన సామగ్రి, స్టాక్ రిజిస్టర్లను కమిషనర్ పరిశీలించారు. వంటకు వినియోగిస్తున్న సరుకుల నిల్వలను తనిఖీ చేసి, అవి తాజాగా, నాణ్యతగా ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీ అనంతరం కమిషనర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య, ఆహారం అందేలా సంబంధిత సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఖ

# నేటి నుంచి కార్పొరేట్ ఆసుపత్రుల లో కొత్త ఈ హెచ్‌ఎస్ పథకం అమలు





హైదరబాద్, బతుకమ్మ:తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు వారి ఆధారితుల ఆరోగ్య భద్రతకు ఒక చారిత్రాత్మక ముందడుగుగా, కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకం (న్యూ ఈ హెచ్‌ఎస్ ) నేడు అధికారికంగా ప్రారంభమైంది. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను మరింత బలోపేతం చేసే ముఖ్యమైన ముందడుగు ఇది. శనివారం తెలంగాణ సచివాలయంలో ట్రస్ట్ బోర్డు కన్వీనర్ ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీజీ-జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ తో సహా ఉద్యోగుల ఆరోగ్య పథకం బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ స్టేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, అలాగే అపోలో హాస్పిటల్స్, కాంటినెంటల్ హాస్పిటల్స్, యశోద హాస్పిటల్స్, కిమ్స్ హాస్పిటల్స్ వంటి ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. చర్చల అనంతరం, తెలంగాణ స్టేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ పాల్గొన్న ఆసుపత్రుల బృందాలు ఏకగ్రీవంగా న్యూ ఈ హెచ్ ఎస్ పథకాన్ని నేటి నుండే తక్షణమే అమలు చేయాలని అంగీకరించాయి. తద్వారా అర్హులైన లబ్ధిదారులకు నగదు రహిత చికిత్స సదుపాయాలు నేటి నుండి అందుబాటులోకి వచ్చాయి. సమావేశంలో న్యూ ఈ హెచ్ ఎస్ మార్గదర్శకాలను కూడా విడుదల చేశారు, ఇవి ఆసుపత్రుల ఎంపానెల్‌మెంట్, చికిత్స ప్రోటోకాల్స్, క్లెయిమ్ సెటిల్‌మెంట్ విధానాలకు సంబంధించిన సవరించిన విధివిధానాలను నిర్దేశిస్తాయి. ఈ కొత్త పథకానికి ఆసుపత్రుల వర్గం సహకరించిన తీరుపై ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే దిశగా ఇది ఒక సానుకూల ముందడుగుగా అభివర్ణించారు. లబ్దిదారులకు సకాలంలో, ఇబ్బంది లేకుండా చికిత్స లభించేలా న్యూ ఈ హెచ్ ఎస్ మార్గదర్శకాలను అక్షరాలా, స్ఫూర్తితో అమలు చేయడంలో పూర్తి సహకారం అందించాలని ఎంపానెల్డ్ ఆసుపత్రులందరికీ ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది.

# ఏఐటీయూసీ ద్వారానే కార్మికులకు రక్షణ

కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమాలకు సిద్ధం కావాలి.

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య.





బాన్సువాడ బతుకమ్మ : కార్మికుల హక్కులు, చట్టాల పరిరక్షణకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య పిలుపునిచ్చారు. శనివారం బాన్సువాడ పట్టణంలోని నాయిని బ్రాహ్మణ సేవా సంఘంలో ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దుబాస్ రాములు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా వై. ఓమయ్య హాజరై మాట్లాడారు. 1920 అక్టోబర్ 31న కార్మికుల హక్కులు, చట్టాల కోసం ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి పనిగంటలు, పని భద్రత వంటి హక్కులను సాధించుకున్నామని తెలిపారు. అనంతరం ప్రభుత్వాలతో పోరాడి పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, కనీస వేతనాలు తదితర అనేక కార్మిక చట్టాలను సాధించుకున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కార్మికులకు అనుకూలంగా ఉన్న చట్టాలను రద్దు చేసి, యజమానులకు అనుకూలంగా లేబర్ కోడ్లను తీసుకొస్తోందని ఓమయ్య విమర్శించారు. కార్మికులు సంఘటితమై తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సెప్టెంబర్ 6న జరిగే బహిరంగ సభకు వేలాది మంది కార్మికులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు చెన్నంగారి సురేష్, ఒల్లెపు గంగాధర్, అబ్రహం, అంజయ్య, ఎస్. రాధ, శ్రీదేవి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క క్లిక్‌తో మోసం.. ఒక్క తప్పిదంతో ప్రమాదం!

డీఎస్పీ శ్రీనివాస్ రావు



సదాశివనగర్, బతుకమ్మ : సైబర్ మోసాలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలపై ప్రజలు, యువత మరింత అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. పద్మాజివాడలోని విద్యార్థులకు డ్రగ్స్, ట్రాఫిక్,సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి.. సురక్షితంగా ఉండాలని అన్నారు.

## బీర్కూర్ మండల సర్పంచుల ఫోరం

అధ్యక్షుడిగా అరిగే ధర్మతేజ.

ఉపాధ్యక్షుడిగా రేంజర్ల అనిల్.



బాన్సువాడ బతుకమ్మ : కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్ మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా అరిగే ధర్మతేజ, ఉపాధ్యక్షుడిగా రేంజర్ల అనిల్, ప్రధాన కార్యదర్శిగా కవిత పండరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అరిగే ధర్మతేజ మాట్లాడుతూ.. బీర్కూర్ మండలంలోని సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతానని తెలిపారు. సర్పంచుల హక్కులు, గ్రామాల అభివృద్ధి కోసం అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుధరణి రాములు, కవిత పండరి, శ్రీనివాస్, రమేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా ‘ఛాత్రోంకి గూంజ్’ కార్యక్రమంలి




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్‌లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన “ఛాత్రోంకి గూంజ్” కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డితో కలిసి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పుణేలో నిర్వహించిన “ఛాత్రోంకి గూంజ్” లైవ్ కార్యక్రమాన్ని మహేష్ కుమార్ గౌడ్ వీక్షించారు. విద్యార్థులు, యువతకు సంబంధించిన అంశాలు, వారి సమస్యలు, భవిష్యత్ అవకాశాలపై నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్ బిన్ హమ్దాన్, శేఖర్ గౌడ్, పీపీ దయాకర్ గౌడ్, మనాల మోహన్ రెడ్డి,నరాల రత్నాకర్, మజీద్ ఖాన్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

